31 నుంచి మెట్‌కోర్ పరిశ్రమ లాకౌట్

టెక్కలి, జూలై 17: రావివలసలోని మెట్‌కోర్ ఎల్లాయిస్ పరిశ్రమ ఈ నెల 31 నుంచి లాకౌట్ చేయనున్నట్లు ప్రస్తుత నిర్వాహకులు (వెంకటేశ్వర ఇంజనీరింగ్ వర్క్స్ యాజమాన్యం) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నెలరోజులపాటు గమనించినా ప్రయోజనం లేదని, ఫ్యాక్టరీని ఇక కొనసాగించలేమని నోటీసులో పేర్కొన్నారు. మార్కెట్ పరిస్థితి అనుకూలమై.. మళ్లీ ఫ్యాక్టరీ ప్రారంభిస్తే కార్మికులకు ముందుగా సమాచారం అందజేస్తామని తెలిపారు. రెండు నెలల కాలవ్యవధిలో కార్మికుల గౌరవప్రదమైన మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు.

వీరజవాన్.. అమర్ రహే



జగదీశ్వరరావు (ఫైల్)

● పోలీసు లాంఛనాలతో ఆర్మీ హవల్దార్ జగదీశ్వరరావు అంత్యక్రియలు

నందిగాం, జూలై 17: నందిగాం మండలం వల్లభరాయుడుపేటలో ఆర్మీ హవల్దార్ సనపల జగదీశ్వరరావు (40) అంత్యక్రియలు పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. జమ్మూ సరిహద్దు ప్రాంతంలో సోమవారం జరిగిన ఉగ్రదాడిలో జగదీశ్వరరావు వీరమరణం పొందిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి ఆయన మృతదేహాన్ని ఆర్మీ అధికారులు బుధవారం తెల్లవారుజామున నందిగాం తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా స్వగ్రామానికి చేర్చారు. ప్రజల దర్శనార్థం కొద్దిసేపు ఇంటి ఆవరణలో ఉంచారు. భర్త మృతదేహంపై పడి భార్య సమత రోదించడం.. చిన్నారులు బేలచూపులు చూపడం స్థానికులను కలచివేసింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. ఆర్మీ, ఎన్‌సీసీ తదితర పోలీసు ర్యాంక్ అధికారులు జగదీశ్వరరావు భౌతికకాయంపై జాతీయజెండా కప్పారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం వీర మరణానికి గౌరవ సూచికంగా మూడుసార్లు గాలిలో కాల్పులు జరిపి నివాళులర్పించారు. తహసీల్దార్ వి.పద్మావతి, టీడీపీ నాయకులు ఎల్.ఎల్.నాయుడు, వంశధార ప్రాజెక్ట్ చైర్మన్ మళ్ల బాలకృష్ణ, ఎస్.జానకిరాం, జె.మోహనరావు, కె.ధర్మారావు, బి.గిరిబాబు, ఎస్.కృష్ణారావుతో పాటు టెక్కలి, పలాసకు చెందిన విశ్రాంత ఆర్మీ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు. 'వీరజవాన్ అమర్‌రహే', 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు. పోలీసుల లాంఛనాలు అనంతరం తండ్రి సనపల మల్లేశ్వరరావు జగదీశ్వరరావు చితికి నిప్పంటించి దహన సంస్కారాలు నిర్వహించారు.



పోలీసు లాంఛనాలతో జగదీశ్వరరావు అంత్యక్రియలు..

ఈ కష్టం.. ఎవరికీ రాకూడదు

● రాజేష్ తండ్రి చిట్టివాడు ఆవేదన



సంతబొమ్మాళి, జూలై 17: తమ కుటుంబానికి వచ్చిన కష్టం.. పగవారికి కూడా రాకూడదని ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన ఆర్మీ జవాన్ డొక్కరి రాజేష్(25) తండ్రి చిట్టివాడు ఆవేదన వ్యక్తం చేశాడు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన ఆర్మీ జవాన్ రాజేష్.. జమ్మూకాశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఎదురుదాడిలో సోమవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహం కోసం కుటుంబ సభ్యులు, బంధువులు ఎదురుచూస్తున్నారు. రాజేష్ తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. 'మేము నిరు పేదలం. కూలి చేస్తూ మా కుమారుడు రాజేష్‌ను ఇంటర్ వరకు చదివించాం. తొలి ప్రయత్నంలోనే ఆర్మీ ఉద్యోగం సంపాదించాడు. ఎంతో సంతోషించాం. ఇటీవల సెలవు పెట్టి ఇంటికి వచ్చాడు. పెళ్లి చేసుకో నాయనా.. అని మేము చెప్పాం. తమ్ముడికి ఉద్యోగం వచ్చి స్థిరపడిన తర్వాత.. మనం ఇల్లు కట్టుకుని.. ఆ తర్వాతే తాను పెళ్లి చేసుకుంటానని బదులిచ్చాడు. అటువంటి దయాహృదయుడు నా బిడ్డ. మాకు చేతికి అందివచ్చిన కొడుకును ఆ భగవంతుడు లాగేసుకున్నాడు. ఇటువంటి కడుపుకోత ఏ పగవాడికి కూడా రాకూడదు' అని రాజేష్ తండ్రి చిట్టివాడు బోరున విలపించాడు. మాకు శాశ్వతంగా దూరమయ్యాడన్న బాధ ఉన్నా.. దేశం కోసం వీరమరణం పొందడం కాస్త ఆనందంగా ఉందన్నారు.



రాజేష్ (ఫైల్)

ఆపదొస్తే.. ఆదుకునేవాడు

గ్రామంలో ఆర్థికంగా ఎవరికి ఏ ఆపద వచ్చినా.. రాజేష్ ఆదుకునేవాడని తోటి స్నేహితులు తెలిపారు. 'ఆర్మీలో ఉద్యోగం సంపాదించేందుకు.. గ్రామంలో యువకులమంతా వేరేచోట ఒక రూమ్ తీసుకుని.. తీవ్రంగా సాధన చేశాం. అప్పట్లో రాజేష్ తల్లిదండ్రులు ప్రతినెలా రూ.3వేలు పంపేవారు. వాటిని జాగ్రత్తగా ఖర్చు చేసేవాడు. ఉద్యోగం వచ్చేవరకూ మేమంతా పండుగలకు కూడా గ్రామానికి వచ్చేవారం కాదు. ప్రస్తుతం స్నేహితులమంతా సైనికదళాల్లో పనిచేస్తున్నాం. రాజేష్ మృతి చెందాడనే వార్త తెలియగానే షాక్‌కు గురయ్యాం. భౌతికకాయానికి జైపూర్‌లో ప్రధాని మోదీ నివాళి అర్పించడం.. రాజేష్‌కు దక్కిన గౌరవం. రాజేష్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల'ని స్నేహితులు కోరారు.

నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

చెట్లతాండ్రలో గురువారం అధికార లాంఛనాలతో రాజేష్‌కు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు స్థానికులు తెలిపారు. జైపూర్ నుంచి ఆయన మృతదేహాన్ని బుధవారం రాత్రి విశాఖకు తీసుకువచ్చి.. భద్రపరుస్తారన్నారు. గురువారం ఉదయం సైనికదళాలు రాజేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి.. అంత్యక్రియలు పూర్తిచేస్తారని వెల్లడించారు.



భక్తి శ్రద్ధలతో ఏకాదశి

శ్రీకాకుళం కల్చరల్, జూలై 17: మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన రోజుగా భావించే.. తొలి ఏకాదశి పర్వదినాన్ని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బుధవారం ఉదయానే ఆలయాల్లో స్వామి దర్శనానికి భక్తులు బారులుతీరారు. హరినామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. శ్రీకాకుళంలోని నారాయణ తిరుమల ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయంలో తులసీ దళాలు, పూలతో వేంకటేశ్వరస్వామికి అలంకరించి పూజలు చేశారు. మహిళలతో లలితా సహస్ర, గోవిందనామాల పారాయణాలు నిర్వహించారు.



నారాయణ తిరుమలలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

డీఐజీని కలిసిన ఎస్పీ మహేశ్వరరెడ్డి



విశాఖ రేంజ్ నూతన డీఐజీ గోపీనాథ్ జెట్టిని.. ఆయన కార్యాలయంలో బుధవారం ఎస్పీ కే.వి.మహేశ్వర రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. డీఐజీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

- శ్రీకాకుళం క్రైం

● పర్మినెంట్ పేరిట రూ.లక్షల్లో ఉద్యోగి చేతివాటం

● బాధితులను విచారించిన డీసీ.. కమిషనర్‌కు నివేదిక

● నిజాలు చెప్పిన వారిపై అర్చకుడి కక్షసాధింపు

● వేధింపులు తాళలేక దినసరి ఉద్యోగి ఆత్మహత్యాయత్నం


● అరసవల్లిలో రచ్చపై కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

● శాఖాపరమైన విషయాల్లో అర్చకుల పాత్రపై విమర్శలు

ఆదిత్యుడి చెంత.. విచారణ చిచ్చు



అరసవల్లి ఆదిత్యాలయం



మీ కోసం
(PGRS)
ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక
Public Grievance Redressal System
కలెక్టరు వారి కార్యాలయం, శ్రీకాకుళం జిల్లా
అర్జీ రశీదు
అర్జీదారుని కాపీ / Petitioner Copy

ఆధార్ నెం.	: 8231 3544 4592
అర్జీ నెంబర్	: 324 తేది: 08/07/2024
అర్జీ రకం	:
పేరు	:
జిల్లా	: శ్రీకాకుళం మండలం:
గ్రామం	: ఫోన్ : 9573805572
ప్రస్తుతం నివాసం	:
సమస్య వివరాలు	:
పరిష్కరించు అధికారి	: గడువు తేది:
గడువు	:
అర్జీ కేటగిరి	: PGRS
ఎన్రోల్మెంట్ అధికారి పేరు / సంతకం	

మీకోసంలో ఫిర్యాదు చేసిన పత్రం

(శ్రీకాకుళం క్రైం/ అరసవల్లి)

అరసవల్లిలోని ఆదిత్యాలయంలో ఓ ఉద్యోగి.. పర్మినెంట్ పేరుతో దినసరి ఉద్యోగుల నుంచి రూ.లక్షల్లో కాజేశారు. ఈ ఘటనపై జరుగుతున్న విచారణ.. ఉద్యోగులకు, అర్చకులకు మధ్య చిచ్చు రేపుతోంది. అక్రమాలకు పాల్పడిన ఉద్యోగిని కొందరు అర్చకులు వెనకేసుకు వస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విచారణలో వాస్తవాలు వెల్లడించిన దినసరి ఉద్యోగులపై ఓ అర్చకుడు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఆదిత్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు.. ఇటీవల దినసరి ఉద్యోగులకు పర్మినెంట్ ఉత్తర్వులు ఇప్పిస్తానని నమ్మించి.. సుమారు రూ.40లక్షలకుపైగా వసూళ్లు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గత నెలలో డీసీ సుజాత.. ఆదిత్యుని ఆలయంలో డబ్బులు ఇచ్చిన ఉద్యోగులను విచారించారు. ఈ మేరకు ఉద్యోగులు తమకు జరిగిన అన్యాయాన్ని నిర్భయంగా డీసీకి చెప్పారు. దీంతో ఉద్యోగుల నుంచి నగదు వసూళ్లు నిజమేనని స్పష్టమైంది. ఈ మేరకు వారి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేసి కమిషనర్‌కి నివేదిక పంపించారు. విచారణ చిచ్చుకు ఆజ్యం పడింది. ఆలయంలో ఓ వర్గం.. విచారణలో నిజాలు చెప్పిన వారిని, ఈవోను, చివరికి విచారణాధికారిణి డీసీపై కూడా కక్షసాధింపు చర్యలకు పూనుకున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. విచారణ అనంతరం నివేదికను కమిషనర్‌కు పంపించొద్దని, మోసాలకు పాల్పడిన కృష్ణమాచార్యులకు క్లీన్‌చిట్ ఇవ్వాలని ఈవోతో పాటు డీసీపై కొంతమంది అర్చకులు ఒత్తిడి తీసుకొచ్చారు. కాగా.. అప్పటికే కమిషనర్ కార్యాలయానికి నివేదిక వెళ్లిపోవడంతో పైస్థాయి నుంచి పావులు కదిపేలా ప్రయత్నాలు ప్రారంభించారు. కొంతమంది ఉద్యోగులతో కలిసి ఈవో చక్రం తిప్పుతున్నారని.. ఆయనను విధుల నుంచి తొలగించాలని అర్చకులు కొత్త డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. కళ్ల ముందే అన్యాయం జరిగినా.. కృష్ణమాచార్యులను అర్చకులు ఎందుకు వెనకేసుకు వస్తున్నారని డీసీ ఆరా తీయగా.. కొన్ని నిజాలు బయటపడినట్టు సమాచారం.

● వేధింపులు తాళలేక..

విచారణలో స్టేట్‌మెంట్‌లు ఇచ్చిన కొందరు దినసరి ఉద్యోగులపై ఆలయంలోని ఓ అర్చకుడు తన ప్రతాపం చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్దాయన దృష్టిలో మీరంతా ఉన్నారని.. మీ సంగతి తేలుస్తామని.. అర్చకుడు తమపై చిర్రుబుర్రులాడడం పరిపాటిగా మారిందని దినసరి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ దినసరి ఉద్యోగి కామేష్.. తాను విచారణకు సహకరించిన నేపథ్యంలో అర్చకుడు వేధింపులకు గురిచేస్తున్నారని పోలీసు బాస్‌కు లేఖ రాశారు. వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. తనలాంటి దుస్థితి మరెవరికీ రాకూడదని లేఖ రాసి.. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇంట్లో ఆ లేఖ దొరకడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం గాలించారు. కొద్దిసేపటి తర్వాత ఆచూకీ దొరకడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరడంతో పంచాయితీ జరిగింది. అలాగే ఆలయంలోని మరో దినసరి ఉద్యోగి ధనుంజయ్ కూడా.. అర్చకుడి వేధింపులు తాళలేక.. ఐదునెలలుగా వేతనాలు అందక మన స్తాపంతో ఉద్యోగం మానేస్తున్నట్టు ఈవోకు లేఖ రాసి వెళ్లిపోయాడు.

● తెరమీదకు.. ఫోన్ పే బాగోతం

ఆదిత్యుని దర్శనానికి వచ్చే భక్తుల నుంచి ఫోన్‌పే రూపంలో నగదు వసూళ్లు చేస్తున్నారన్న విషయం.. మంగళవారం డీసీ సుజాత విచారణలో బయటపడింది. ఆదివారం స్వామిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివస్తారు. ఆలయంలో దినసరి ఉద్యోగి కొమ్ము లక్ష్మీనారాయణ.. గతేడాది ఫిబ్రవరి 19న ఓ వ్యక్తికి స్వామి దర్శనం చేయించారు. ఈ మేరకు ఆ వ్యక్తి.. లక్ష్మీనారాయణకు రూ.500 ఫోన్ పే చేశారు. 'దర్శనం బాగా అయ్యింది. మధ్యాహ్నం ఫోన్‌పే మీకు చేశాను. కానీ అవ్వలేదు. అందుకే ఇప్పుడు చేశాను. థ్యాంక్యూ సో మచ్' అని ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపిన తర్వాత లక్ష్మీనారాయణకు మెసేజ్ కూడా చేశారు. దీనిపై డీసీ ఆరా తీయడంతో పాటు డబ్బులు ఫోన్ పే చేసిన వ్యక్తిని గుడికి పిలిపించి విచారించగా వాస్తవమేనని చెప్పుకొచ్చాడు.



అరసవల్లిలో విచారణ చేస్తున్న డీసీ సుజాత (ఫైల్)

● కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలో అవకతవకలు, అవినీతి బాగోతంపై ఈ నెల 8న 'మీకోసం' వేదికలో కలెక్టర్‌కు బాడాన ఎర్రన్నాయుడు, మరి కొంత మంది గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మొత్తం 13 పేజీల్లో ఆలయంలో జరుగుతున్న వ్యవహారాన్ని సవివరంగా రాసి విన్నవించారు. కలెక్టర్ స్పందిస్తూ విచారణ చేపట్టాలని దేవదాయశాఖ డీసీని ఆదేశించారు. అసలు అరసవల్లిలో ఏం జరుగుతోంది? ఎందుకీ రచ్చ? ఉద్యోగులకు-అర్చకుల మధ్య ఎందుకీ విభేదాలు? దినసరి ఉద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లపై ఆరా తీసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీంతో మంగళవారం విశాఖపట్నం నుంచి డీసీ సుజాత ఆదిత్యుని ఆలయానికి వచ్చి విచారణ చేపట్టి ఉద్యోగుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. మోసానికి పాల్పడిన ఉద్యోగిని వెనకేసుకు వస్తూ.. ఆదిత్యుడికి అప్రతిష్ఠ ఎందుకు తీసుకువస్తున్నారని అర్చకులపై డీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ శాఖాపరమైన విషయాల్లో అర్చకుల జోక్యంపై కూడా ఆరా తీశారు. ఆలయ ప్రధాన అర్చకులతో డీసీ సుజాత మాట్లాడి.. ఆరోపణలు వస్తున్న అర్చకుడికి నచ్చజెప్పాలని సూచించినట్టు భోగట్టా. ఇదిలా ఉండగా అరసవల్లిలో జరుగుతున్న రచ్చపై దృష్టి సారించి.. అక్రమాలకు పాల్పడిన కృష్ణమాచార్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు దేవదాయశాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



కొట్టుకుపోయిన పూడిలంక దారి

ఇటీవల కురుస్తున్న వర్షాలకు.. వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక గ్రామం చుట్టూ ఉప్పునీరు చేరింది. దీంతో బుధవారం పూడిలంక నడకదారి కొట్టుకుపోయింది. రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవల కోసం.. ఉన్న ఒక్క పడవపైనే ఆధారపడుతున్నారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి అని వాపోతున్నారు. పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంక చేరుకోవాలంటే నడకదారే ఆధారం. ఈ ఏడాది కూడా నడక దారి గట్టు తెగిపోవడంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు. మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో గ్రామంలో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పూర్తిస్థాయిలో నిధులు చాలక.. కొంతమేర పనులు చేపట్టి నిలిపేశారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రోడ్డు పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం గ్రామం చుట్టూ నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు ఇంతవరకూ తమను పట్టించుకోలేదని పేర్కొంటున్నారు. మరింతగా వర్షాలు కురిస్తే.. ఉప్పుటేరు ఉధృతి పెరిగి.. గ్రామంలోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

- వజ్రపుకొత్తూరు

వంశధార ఎడమ కాలువకు గండి

గొట్టాబ్యారేజీ ఎడమ ప్రధాన కాలువ కుడి గట్టుకు భగీరథపురం కాలనీ 1.8కిలోమీటరు వద్ద మంగళవారం సాయంత్రం గండి పడింది. కాలువ దిగువన ఉన్న పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రైతుల సమాచారం మేరకు బుధవారం ఉదయం వంశధార అధికారులు ఈ గండి ప్రదేశాన్ని పరిశీలించారు. గట్టు మధ్యలో ఎలుకలు రంధ్రాలు చేయడంతో నీరు బయటకు ప్రవహించిందని తెలిపారు. కాలువ ద్వారా నీటి విడుదలను తగ్గించి గండి పూడ్చే పనులు చేపట్టారు. గొట్టాబ్యారేజీ జేఈఈ ధనుంజయరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఆనందం దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. గురువారం నుంచి యథావిధిగా 1100 క్యూసెక్కుల నీరు విడిచి పెడతామని వంశధార డీఈఈ రంగనాయకులు తెలిపారు.

- హిరమండలం



వంశధార ఎడమ కాలువ గట్టుకు పడిన గండిని పూడ్చుతున్న దృశ్యం

ఏపీఈఏపీ సెట్ తొలివిడత సీట్ల కేటాయింపు

● జిల్లాలో 85.74 శాతం భర్తీ

ఎచ్చెర్ల, జూలై 17: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్ తొలి విడత సీట్ల కేటాయింపు వివరాలను సెట్ కన్వీనర్ ప్రకటించారు. జిల్లాలో అంబేడ్కర్ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలతోపాటు, మరో మూడు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో మొత్తం 2,154 సీట్లు ఉండగా, ఇందులో విద్యార్థుల ఆప్షన్ మేరకు, ర్యాంకుల ప్రాతిపదికగా 1,847 సీట్లు(85.74 శాతం) కేటాయించారు. అంబేడ్కర్ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో 330 సీట్లకు 249 సీట్లు కేటాయించగా.. 75.45శాతం నమోదైంది. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం)లో మొత్తం 384 సీట్లు కాగా, 295 సీట్లు (76.8 శాతం) కేటాయించారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 336కు 228 సీట్లు(67.8శాతం), ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల (టెక్కలి)లో 1104కు 1075 సీట్లు (97.37 శాతం) కేటాయించారు. వీటిలో సీఎస్ఈ బ్రాంచ్‌లో చేరేందుకే విద్యార్థులు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. నాలుగు కళాశాలల్లో సీఎస్ఈ బ్రాంచ్‌లో మొత్తం 546 సీట్లు ఉండగా 529 సీట్లు (96.88 శాతం) కేటాయించారు. ఏపీఈఏపీ సెట్ తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 4న ప్రారంభమై.. 13 వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం ఇచ్చారు. ఈ నెల 22వ తేదీలోగా విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి. ఈ నెల 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

దిక్సూచి DIKSUCHI

లా కోర్సులలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ఛాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

అండర్ గ్రాడ్యుయేట్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.


యూజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు. కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.

అర్హతలు: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)(బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ ఈఐఈ/ ఈసీఈ/ బయోటెక్నాలజీ/ మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/ బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** www.uceou.edu

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/1ZB524Mలో చదవండి.



ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే సినిమా



ఇటీవలే 'ఓమ్ భీమ్ బుష్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు ప్రియదర్శి. ఆయన, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా రేపు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చింది. స్క్రిప్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. సినిమాకు ఈ టైటిల్‌ను చాలా ప్రేమతో పెట్టాం. కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ఈ సినిమా.. రిలేషన్‌షిప్‌లో ఉన్న వారితో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది. ఇందులో నా ప్రపంచం, నభా ప్రపంచం చాలా వేరుగా ఉంటాయి. భిన్న ధ్రువాలైన మా ఇద్దరి మధ్య సీరియస్‌గా జరిగే సంఘటనలతో సాగే సన్నివేశాలను ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. స్క్రీన్‌ప్లే చాలా వైవిధ్యంగా ఉంటుంది. 'డార్లింగ్' సినిమాను అందరూ చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు" అని ప్రియదర్శి అన్నారు.

ఆగస్టులో భవనమ్ విడుదల



ప్రతిష్ఠాత్మక నిర్మాణసంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ఉపశీర్షిక. ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సిర్వీ నిర్మిస్తున్నారు. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన తారాగణం. బాలాచారి కూరెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం మేకర్స్ 'భవనమ్' విడుదల తేదీని ప్రకటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల్ని భయపెట్టడంతో పాటు మంచి హాస్యంతో అలరిస్తుందని చిత్ర బృందం తెలిపింది. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్‌రెడ్డి, ఎడిటర్: ఎన్టీఆర్.

'ఏం చేద్దామంటావ్ మరి'... కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ ఊతపదం



● దర్శకుడు పూరి జగన్నాథ్‌పై కేసు నమోదు

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా నుంచి ఇటీవలే విడుదలైన 'మార్ ముంత చోడ్ చింత' అనే పాటలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు వాయిస్‌ను ఉపయోగించడంపై బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అభ్యంతరం తెలుపుతున్నారు. కల్లు కాంపౌండ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ గీతంలో 'ఏం చేద్దామంటావ్ మరి' అనే కేసీఆర్ పాపులర్ డైలాగ్‌ను రెండుసార్లు ఉపయోగించారు. వెంటనే పాట నుంచి ఆ హుక్‌లైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఎం. రజితారెడ్డి, జీ. సతీష్‌కుమార్ బుధవారం ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'పదేళ్ల తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ వాయిస్‌ను కల్లు కాంపౌండ్‌లో చిత్రీకరించిన ఐటమ్ సాంగ్‌లో ఉపయోగించడం తప్పు, ఇది కేసీఆర్‌ను అవమానించడమే కాక తెలంగాణ ప్రజల మనోభావాలనూ దెబ్బతీసేలా ఉంది' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మా ప్రాంత యాస, భాష, మా నాయకుడిని కించపరిచినా సహించేది లేదు, అవసరమైతే పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామ'ని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. పాట రచయిత కాసర్ల శ్యామ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌పైనా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై చిత్రబృందం ఇంతవరకూ స్పందించలేదు.

త్వరలోనే మీ ముందుకొస్తా



నటించిన అతికొద్ది చిత్రాలతోనే తన సూపర్ యాక్టింగ్‌తో.. మంచి టైమింగ్‌తో నటుడిగా స్పెషల్ ఇమేజ్ తెచ్చుకున్నారు నవీన్ పొలిశెట్టి. 2023లో విడుదలైన 'మిస్.శెట్టి, మిస్టర్ పొలిశెట్టి' చిత్రం తర్వాత ఆయన తెరపై కనిపించలేదు. ఈ విరామానికి గల కారణాన్ని ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

"నేను మీ అందరితో ఓ వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. నేను చేస్తున్న సినిమాల గురించి అప్‌డేట్స్ లేవని అందరూ అడుగుతున్నారు. దానికి కారణం ఇటీవలే జరిగిన బైక్ ప్రమాదంలో నా చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ గాయాల వల్లే నేను సినిమాలను అనుకున్న టైమ్‌కి మీ ముందుకు తీసుకురాలేకపోతున్నాను. ఈ విరామానికి నన్ను క్షమించండి. త్వరలోనే పూర్తిగా కోలుకుని మిమ్మల్ని తిరిగి ఎంటర్టైన్ చేస్తాను" అని పేర్కొన్నారు.

'సర్దార్-2' షూటింగులో స్టంట్‌మేన్ మృతి



తమిళ నటుడు కార్తీ హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఈ సినిమా కోసం ఒక ఫైట్ చిత్రీకరిస్తుండగా, 20 అడుగుల ఎత్తు నుంచి ఫైట్ ట్రైనర్ (స్టంట్‌మేన్) ఏళుమలై ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో మంగళవారం ఫైట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో ఫైట్ రిహార్సల్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఏళుమలై కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నిర్మాత లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యంగానే ఉన్నా

ఆర్.నారాయణమూర్తి



ప్రజానటుడు ఆర్.నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతతో బుధవారం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆయనను ప్రత్యేక విభాగంలో ఉంచి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఉండటంతో హృద్రోగ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ పరీక్షలను వైద్యులు చేసి, ప్రమాదం ఏమీ లేదని నిర్ధారించారు. గ్యాస్ట్రిక్ సమస్య అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నారాయణమూర్తికి ఏమైందంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతుండడంతో 'నేను ఆరోగ్యంగా ఉన్నా.. అభిమానులూ ఆందోళన చెందకండి. దేవుడి దయ వల్ల బాగానే ఉన్నా. పూర్తిగా కోలుకున్న తర్వాత అన్ని వివరాలూ వెల్లడిస్తా' అని ఓ ప్రకటనలో తెలిపారు నారాయణమూర్తి.



తన భర్త నికోలై సచ్‌దేవ్‌తో కలసి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. 'హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్.. మీరంతా నాకు చాలా సపోర్ట్ చేశారు. ఇక ముందు కూడా ఇలానే సహకరించాలి' అని కోరారు వరలక్ష్మి

'బడ్డీ' వచ్చేది ఎప్పుడంటే..!




అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న 'బడ్డీ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోనీ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు జ్ఞానవేల్ రాజా, అధన చెప్పారు. ఈ చిత్ర నిర్మాణం ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద కొత్త ప్రయత్నం అని వారు చెప్పారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాటలు మంచి ఆదరణ పొందాయని చెప్పారు.

టికెట్ రేట్లు తగ్గించాలి



వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా రూపుదిద్దుకున్న 'పేక మేడలు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రె నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రాన్ని విడుదల చేస్తున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'పెద్ద సినిమాల టికెట్ రేట్లు ఎంత ఉన్నా ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. ఇలాంటి చిన్న సినిమాలకు తక్కువ రేట్లు ఉండాలి. అందుకే టికెట్ రేటు వంద రూపాయలు పెట్టాం. ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని పెయిడ్ ప్రీమియర్స్ కు రూ 50 పెట్టాం. సినిమా బాగుందని ప్రతి ఒక్కరూ చెప్పారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ 'ఈ సినిమా విడుదల చేయడానికి ముందుకు వచ్చిన ధీరజ్‌కు ధన్యవాదాలు. అలాగే మా సినిమాకు సపోర్ట్ చేసిన రానా దగ్గుబాటి, అడవి శేష్, విష్వక్‌సేన్‌కు కృతజ్ఞతలు' అన్నారు. పెయిడ్ ప్రీమియర్స్‌కు వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉందని వినోద్ కిషన్ చెప్పారు.





రాష్ట్ర వ్యాప్తంగా రైతుబజార్ల అభివృద్ధికి చర్యలు

● వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జూలై 17: రైతులకు, వినియోగదారులకు ఉపయోగ పడేలా రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక, మార్కెటింగ్ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం కోటబొమ్మాళి రైతు బజారును ఆకస్మికంగా సందర్శించారు. రైతులు పండించిన కూరగాయలను వినియోగ దారులకు నిర్దేశించిన ధరలకే విక్రయించేలా చూడాలన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతుబజార్లను నిర్వీర్యం చేసిందని, తిరిగి కూటమి ప్రభుత్వం వాటికి పూర్వవైభవం తీసుకువస్తుందన్నారు. రైతు బజార్లలో సదుపాయాలు కల్పిస్తామని, ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని వ్యాపారులను కోరారు. అనంతరం కొత్తమ్మతల్లి ఆలయ వద్దకు చేరుకొని ఈ ఏడాది కొత్తమ్మతల్లి ఆలయ ఉత్సవాలపై ఆరా తీశారు. ఉత్సవాలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవాలయ అధికారులకు సూచించారు.


టెక్కలి: కోటబొమ్మాళి రైతుబజారులో వ్యాపారులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కేజీబీవీ సందర్శన

కోటబొమ్మాళిలోని కేజీబీవీని మంత్రి అచ్చెన్నాయుడు సందర్శించారు. పిల్లలను ఎంతో నమ్మకంతో తల్లిదండ్రులు కేజీబీవీలో చేర్పిస్తున్నారని, వారికి అసౌకర్యం కలగకుండా అధికారులు చూడాలన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ఇటీవల విద్యార్థినులు డయేరియాకు గురికావడం, వారికి అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు. కేజీబీవీ విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు కింజరాపు హరిప్రసాద్, బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి, నంభాళ్ల శ్రీనివాస్, ఏపీసీ రోణంకి జయప్రకాష్, ప్రిన్సిపాల్ కింతలి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణలో చొరవ చూపాలి

● ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: గంజాయి నియంత్రణలో పోలీస్ యంత్రాంగం చొరవ చూపాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నారన్న ప్రచారం జరుగుతోందని, దీనివల్ల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని, దీనికి మూలాలలను గుర్తించి నియంత్రించాలని సూచించారు. ఒడిశా నుంచి గంజాయి చిన్న పొట్లాల రూపంలో వస్తు న్నట్లు సమాచారం వస్తోందన్నారు. దీని నియంత్రణకు ఉక్కుపాదం మోపాలన్నారు. అలాగే ఇటీవల కాలంలో ఆలయాలు, ఇళ్లలో దొంగతనాలు ఎక్కువయ్యాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కొత్తూరు సీఐ వేణుగోపాలరావు, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం ఎస్ఐలు మహమ్మద్ యాశిన్, టి.రాజేష్, నారాయణ స్వామి ఎంఏ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేగోవిందరావు

రోగులకు మెరుగైన వైద్య సేవలందించండి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు (సారవకోట): వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుడితి సీహెచ్‌సీని బుధవారం పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డులను సందర్శించి రోగులతో మా ట్లాడి ఆసుపత్రిలోని సౌకర్యాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్ల ఆసుపత్రి నిర్లక్ష్యానికి గురై రోగులకు సరైన సేవలందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఆసుపత్రుల్లో రోగులకు అన్ని సౌకర్యాలతో పాటు మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, సర్పంచ్ పొన్నాన శంకరరావు, ఎంపీటీసీ మెండ మురళీకృష్ణ పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సాగు భూములపై హక్కులు కల్పించండి

జలుమూరు: మాకివలసలో గిరిజనులు సాగు చేస్తున్న భూములపై వారికి సాగుహక్కు కల్పించి పట్టాలు మంజూరు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాకివలసకు చెందిన గిరిజనులు పాపారావు, ఉత్తరయ్య, ప్రసాద్, లచ్చుము, పోలయ్య, శ్రీను, సూరపునాయుడు, హరీష్ ఉన్నారు.

75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు

పాతపట్నం: పశుగ్రాస విత్తనాలను 75 శాతం రాయితీపై అందిస్తున్నట్లు, వీటిని సద్వి నియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

టెక్కలి: భీంపురం 11 కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బొరిగిపేట, మేఘవరం, భీంపురం, సొర్లిగాం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చల్లవానిపేట సబ్ స్టేషన్ పరిధిలో..

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అల్లాడ ఫీడర్‌పై గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అల్లాడ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. కరవంజ, పాగోడు, గొటివాడ,ర సైరిగాం, అల్లాడ, అంధవరం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేపు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు పౌర సన్మానం

టెక్కలి: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం సాయంత్రం 5గంటలకు కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులకు పౌరసన్మానం చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి తెలిపారు. ఈ మేరకు బుధవారం మంత్రి అచ్చెన్నాయుడును కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోళ్ల లవకుమార్, హనుమంతు రామకృష్ణ, మెండ దమయంతి, లాడి శ్రీనివాస్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మల్లిపెద్ది మధు తదితరులు కోరారు.

పాఠశాల గోడ పునర్నిర్మాణం

ఎల్.ఎన్.పేట: తాయిమాంబపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ (గార్లపాడు) ప్రాథమిక పాఠశాలకు సంబంధించి రెండు గదుల మధ్య ఉన్న గోడను పునర్నిర్మించారు. ఈ భవనాన్ని ఎమ్మార్సీ కార్యాలయంగా మార్చేందుకు ఎంఈవో మణికుమార్ గోడను తొలగించే ప్రక్రియ చేపట్టగా స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సదరు గోడను బుధవారం నిర్మించారు.

ఆక్రమణలను తొలగించాలి

హిరమండలం: హిరమండలంలోని సుభలయ కాలనీ సమీపంలో వంశధార కుడి కాలువ గట్టును కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారని దీంతో కాలువలు బాగు చేసేందుకు వీలు కావడం లేదని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. దీంతో గ్రామంలోని మురుగునీరు బయటకు పోయేందుకు వీలులేకుండా ఉందన్నారు. బుధవారం గ్రామంలో ఆక్రమణలు, కాలువ వ్యవస్థను పంచాయతీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆక్రమణదారులకు నోటీసు లిచ్చి ఆక్రమణలను తొలగించాలని, తాగునీరు, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు. పరిశీలనలో సిబ్బంది నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి జనసేన సభ్యత్వ నమోదు

పోలాకి: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు గురువారం నుంచి చేపడుతున్నట్లు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ పరంగా వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు 50 మంది వలంటీర్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 10వేల సభ్యత్వాల నమోదు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సభ్యత్వంలో ముందుండాలి

మెళియాపుట్టి: గత ఏడాది కంటే జనసేన సభ్యత్వంలో ముందుండాలని జనసేన నాయకులు దుక్క బాలరాజు, సవలాపురం చంటి తెలిపారు. బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యులుగా చేరిన వారు రూ.500 చెల్లిస్తే బీమా సదుపాయం పార్టీ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రాజేష్ కుటుంబానికి బీజేపీ నేతల పరామర్శ

సంతబొమ్మాళి: ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన చెట్లతాండ్రకు చెందిన డొక్కరి రాజేష్ కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా నాయకులు బుధవారం పరామర్శించి ఓదార్చారు. ఉగ్రవాదులతో పోరాడి వీరమరణం పొందిన రాజేష్ చరిత్రలో నిలిచిపోతారని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు అన్నారు. పరామర్శించిన వారిలో పలువురు నేతలున్నారు.

నేటి నుంచి కుష్ఠు వ్యాధిపై ఇంటింటా సర్వే

నరసన్నపేట: కుష్ఠు వ్యాధి రహిత భారతదేశంగా 2027 నాటికి తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గురువారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటా సర్వే చేపట్టనున్నారు. దీనిలో భాగంగా 2027 వరకు ప్రతీ ఏటా రెండు సార్లు ఇంటింటి సర్వే చేసేదుందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆరోగ్య కేంద్రాలు, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో జిల్లాలో 7,20,783 ఇళ్లలో ఈ సర్వే ద్వారా రోగులకు స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్ తెలిపారు. ప్రతీరోజు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటలు వరకు ఈ సర్వేను చేపట్టనున్నామన్నారు. చర్మంపై ఎటువంటి అనుమానాస్పద మచ్చలు ఉన్నట్లయితే వారి వివరాలను నమోదు చేసి సంబంధిత పీహెచ్‌సీలకు సమాచారం అందిస్తామన్నారు.

జిల్లాలో కేసుల వివరాలిలా..

సమాజంలో ఇప్పటికీ వెలుగు చూస్తున్న కొత్త లెప్రసీ కేసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 2017లో తొలిసారిగా ఎల్‌సీడీసీ సర్వేను ప్రారంభించింది. జిల్లాలో 62 పీహెచ్‌సీల పరిధి లోని జనాభాతో పాటు శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం అర్బన్ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ సర్వే నిర్వహించనున్నారు. 2017లో 219 కేసులు, 2018లో 195, 2019లో 169, 2020-21లో కరోనా బ్రేక్, 2022లో 95, 2023లో 143 కేసులు నమోదయ్యాయి. సర్వే నిర్వహిస్తున్న ప్రతిసారి కొత్త లెప్రసీ కేసులు నమోదు కావడం వ్యాధి తీవ్రతను తెలియజేస్తోంది.

దళితుల సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సమతా సైనిక్‌దళ్ సభ్యులు

టెక్కలి: గత ప్రభుత్వంలో దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేశారని వాటిని పునరుద్ధరించి దళితుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త రామప్పడు కోరారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో సమతా సైనిక్‌దళ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దళిత సంక్షేమంతో పాటు సంఘ ఎన్నికలపై చర్చించారు. కార్యక్రమంలో సమతా సైనిక్‌దళ్ నాయకులు మహేష్, లోకేష్, సత్యం, నాగేశ్వరరావు, శ్రీను, రామకృష్ణ, రంగారావు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై దృష్టి సారించాలి

నరసన్నపేట: ఇసుక అక్రమ రవాణాతో పాటు నరసన్నపేట పట్టణలో గంజాయి విక్రయాలపై దృష్టి సారించాలని ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.గంగాధరం అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌ను పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఎందుకు విఫలమౌతున్నారని ప్రశ్నించారు. సాధారణ ఎన్నికల సమయంలో నమోదైన కేసుల విచారణను పూర్తి చేసి న్యాయ పక్రియను ప్రారంభించాలన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న గంగాధరం

మూలపేట పరిధిలో ఎయిర్ పోర్టు?

సంతబొమ్మాళి: మండలంలో నిర్మాణమవుతున్న మూలపేట పోర్టుకు అనుసంధానంగా మూలపేట ప్రాంతంలోనే ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టనున్నారన్న విషయం జోరుగా ప్రచారం జరుగుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ చేసిన ట్వీట్లతో ఆసక్తి రేపింది. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం జరగనుందని, వాటిలో మూలపేట ఒకటని ఆ ట్వీట్‌లో పేర్కొనడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనికి తోడు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రిగా ఉండడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. ఇప్పటికే మూలపేట పోర్టు నిర్మాణం జరుగుతుండగా, విమానాశ్రయం మంజూరైతే ఈ ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం


ఇచ్ఛాపురం: పీర్లపంజాలో నమాజ్

ఇచ్ఛాపురం: ముస్లింలు మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం లాలాపేట, కస్పా జాలార వీధుల్లోని మసీదులో ప్రత్యేక నమాజ్ చేశారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని పీర్లపంజా స్థలంలో ముతవల్లి ఎంఎస్‌హెచ్ రాబ్బానీ ఆధ్వర్యంలో మొహర్రం జరుపుకున్నారు. ముస్లిం మత పెద్దలు జోహర్‌ఖాన్, అమీర్ ఆలీ, అలీంఖాన్, హెచ్ఎం అబ్దుల్లా, జిలానీ తదితర పెద్దలు పాల్గొన్నారు.

● **శ్రీకాకుళం కల్చరల్:** జామియా మసీదులో మొహర్రం సందర్భంగా జియార్ రహమాన్ ఆధ్వర్యంలో ముస్లింలు నమాజ్ చేశారు. కార్యక్రమంలో ఇమాం ఖాజీ అబ్దుల్ వాహబ్, మౌజన్, మహమ్మద్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో విశాఖ సిటీ మెట్రోపాలిటన్ న్యాయాధికారి

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామిని విశాఖ సిటీ మెట్రోపాలిటన్ న్యాయాధికారి ప్రదీప్‌కుమార్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు స్వాగతంపలికి వారి గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శేషవస్త్రం అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అర్చకుడు నారాయణమూర్తి, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.


న్యాయాధికారిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఉత్తరాంధ్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం రాజీనామా

టెక్కలి: ఉత్తరాంధ్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం మొత్తం రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడు సుంకరి కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాడ గణపతి, జనరల్ సెక్రటరీ కేఎం హరికుమార్, వర్కింగ్ జనరల్ సెక్రటరీ పి.రవి, ఉపాధ్యక్షులు టి.నాగేశ్వరరావు, దేవీప్రసాద్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు, సలహాదారులు తమ పదవులకు రాజీనామా చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వర్షం కురవాలని.. వరద పాయసం చేసి

నందిగాం: వర్షం కురవాలని కోరుకుం టూ నర్సిపురంలో గ్రామస్థులు వరద పాయసాన్ని బుధవారం తయారు చేశారు. గ్రామస్థు లంతా గ్రామ సమీపంలోని సూదికొండ మెట్టపై పాయసం పోసి సందడి చేశారు. ఈ సందర్భంగా వర్షం పడి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.


వరద పాయసం వండుతున్న గ్రామస్థులు

సముద్రంలో ఎగిసిపడుతున్న అలలు

వజ్రపుకొత్తూరు: రెండు రోజులుగా సముద్రంలో కెరటాలు ఉధృతంగా ఉండడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రాకాసి అలలు ఎగిసి పడుతున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. మరో రెండు రోజులు ఇదే విధంగా ఉండే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 32 మంది ఎంపిక

పోలాకి: పోలాకి సత్యసాయి మందిరంలో బుధవారం నిర్వహించిన కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యాధికారి నిశిత 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 32 మందికి కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మందిరం నిర్వాహకుడు బరాటం రామారావు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో పందుల స్వైరవిహారం

నరసన్నపేట: పట్టణంలో పలు వీధుల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. శివారు ప్రాంతాలను పందుల పెంపకం దారులు ఆవాసాలు చేశారు. పందుల ను పట్టణంలోకి వది లేస్తుం డడంతో గుంపులుగా తిరు గుతూ పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. రోడ్ల పక్క ఉన్న చెత్తను దుర్గంధంగా తయారు చేస్తుండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని పట్టణ ప్రజలు చెబుతున్నారు. పాత జాతీయ రహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనాలకు పందులు అడ్డుగా వస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే బండి వీధి, శ్రీశయనవీధి, పాత బస్టాండ్‌లలో మలేరియా, విషజ్వరాలతో పలువురు బాధపడుతున్నారు. పందులను నియంత్రించాలని పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలు వీధులకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



కంచిలి: వేంకటేశ్వర స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

జిల్లా వ్యాప్తంగా తొలి ఏకాదశ పూజలు భక్తిశ్రద్ధలతో బుధవారం భక్తులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విష్ణు, జగన్నాథ, వేంకటేశ్వర తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, స్వామివారి కల్యాణం, అష్టోత్తర శత నామావళి పూజలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం కల్చరల్: టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: శేషపానుపుపై కొలువైన జగన్నాథ స్వామి



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం..



పొందూరు: జగన్నాథస్వామికి పూజలు



మందస: వాసుదేవ ఆలయంలో గరుడస్తంభం వద్ద..



నరసన్నపేట: వేంకటేశ్వరునికి తులసీ దళార్చన



కంచిలి: మఠం కంచిలిలో..



ఇచ్ఛాపురం: జగన్నాథస్వామికి పూజలు

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

టెక్కలి: పట్టణంలోని చేరివీధి సమీపంలో బుధవారం మధ్యాహ్నం విద్యుదాఘాతం జరిగి ఎన్టీఆర్ కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు బతకల పోతయ్య (58) మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా ఓ గోదాం మేడపై పనిచేస్తుండగా పోతయ్య విద్యుత్ హైటెన్షన్ లైన్‌కు తగిలి ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే తోటి భవన నిర్మాణ కార్మికులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోతయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉండగా నిరుపేదయిన పోతయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా యాదవ సంఘ నాయకులు ఇప్పిలి జగదీష్ తదితరులు కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామానికి చెందిన అదపాకల శ్రీధర్(50) బుధవారం అను మానాస్పదస్థితిలో మెళియాపుట్టి మహేంద్రతనయ నది సమీపంలోని శ్మశాన వాటిక వద్ద మృతి చెందారు. బుధవారం కొందరు వ్యక్తులతో తగాదా పడి మెళియాపుట్టి వచ్చినట్టు తెలుస్తోంది. మద్యం సేవించి శ్మశానవాటిక వైపు వెళ్లి అదుపుతప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతి చెందినట్టు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. శ్రీధర్‌కు భార్య, పాప, బాబు ఉన్నారు. అయితే మృతిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించినట్టు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలు..



పద్మావతి(ఫైల్)

రణస్థలం: కొచ్చెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న పైడి పద్మావతి (53) గుండెపోటుతో బుధవారం ఉదయం మృతి చెందారు. ఆరోగ్యంగా ఉన్న తల్లి ఒక్కసారిగా కుప్పకూలిపోయిందని, క్షణాల్లో మృతి చెందిందని పద్మావతి కుమారుడు, కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పిసిని వంతరావు, కూన రంగనాయకులు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి

కొత్తూరు: మండల కేంద్రంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పారాపురం గ్రామానికి చెందిన ఉర్లపు గణపతికి భామిని మండలానికి చెందిన సావిత్రితో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గణపతి చికెన్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో కొత్తూరులో మార్కెట్ కోసం భార్య సావిత్రి రాగా ఆమెతో మాట కలిపి ఇకపై కలిసి ఉందామంటూ గణపతి చెప్పగా.. ఆమె నిరాకరించింది. దీంతో కోపం ఆపుకోలేక గణపతి చికెన్ కోసం వాడే కత్తితో దాడి చేశాడు. సావిత్రి ఛాతి, కడుపు భాగాల్లో గాయాలయ్యాయి. స్థానికులు పక్కనే ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. ఘటనపై కొత్తూరు ఎస్ఐ ఎంఏ అహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐరన్, సిమెంట్ షాపుల్లో చోరీ

నరసన్నపేట: పట్టణంలో మంగళవారం రాత్రి 2.30 గంటల సమయంలో సిమెంట్, ఐరన్ దుకాణాల్లో చోరీలు జరిగాయి. ముగ్గురు వ్యక్తులు ఈ చోరీలకు పాల్పడినట్టు సీసీ కెమెరా ఫుటేజీల్లో బయటపడింది. వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి 2.30 గంటలు ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు సత్యవరం జంక్షన్‌కు సమీపంలో నరసన్నపేట మెయిన్ రోడ్డుపై ఉన్న రవిచంద్ర ట్రేడర్స్, సత్యనారాయణ ట్రేడర్స్ దుకాణాల షట్టర్లను కొంతభాగం పైకెత్తి క్యాష్ కౌంటర్లలో ఉన్న నగదును తస్కరించి పరారయ్యారు. సత్యనారాయణ ట్రేడర్స్‌లో రూ.40వేలు, రవిచంద్ర ట్రేడర్స్‌లో రూ.20 వేలు నగదు చోరీ జరిగినట్టు యజమానులు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించనున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. వ్యాపారులు నుంచి ఫిర్యాదు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ చోరీల్లో 60 ఏళ్లు పైబడిన వ్యక్తి ఒకరు, 35 ఏళ్ల వయసున్న ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టు తెలుస్తోంది.

రోడ్లపై అర్ధరాత్రి తిరిగితే చర్యలు



కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైం: అనవసరంగా అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరుగుతూ వికృత చేష్టలకు పాల్పడితే చర్యలు తప్పవని టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు ఆకతాయిలను హెచ్చరించారు. స్థానిక ఏడురోడ్ల కూడలిలో, ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో కొంత మంది కార్లలో చెక్కర్లు కొడుతూ స్టంట్‌లు వేయడంతో విషయం తెలుసుకున్న సీఐ అక్కడకు చేరుకున్నారు. కారుతో స్టంట్ వేసిన వారితో పాటు బహిరంగంగా మద్యం తాగుతున్న కొంత మంది యువకులకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజలను ఇబ్బంది పెట్టేలా ప్రవరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

దొంగతనం కేసుల్లో అపోహలు వీడాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ శృతి

బూర్జ: దొంగతనాలపై అపోహలు వీడాలని డీఎస్పీ శృతి అన్నారు. చీడివలస గ్రామంలో ఆమె పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. సోలార్ ప్లేట్స్ దొంగతనం కేసులో అపోహలు విడనాడాలని, నిందితులపై చట్ట ప్రకారం తీసుకొనే చర్యలకు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించొద్దని సూచించారు. ఏ సమస్య ఉన్నా స్థానిక పోలీసులకు లేకుంటే నా దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్ వేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా తహసీల్దార్ కె.వేణు గోపాల్ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆర్ఐ శిరీష్, వీఆర్వో, వీఆర్‌ఏలతో కలిసి కొత్తవలస, తొగరాం, దూసి, తోటవాడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల పరిసర ప్రాంతాలైన నాగావళి నది ఇసుక ర్యాంప్‌లకు వెళ్లే రహదారుల్లో ఎక్స్‌కవేటర్ సాయంతో ట్రెంచ్‌లు కొట్టించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు ఆయా గ్రామస్థులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు వచ్చే వరకు ఎవరైనా ఇసుక అక్రమ తవ్వకాలు చేపటొద్దని, అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైసీపీ అక్రమాలు తెలిపేందుకే శ్వేతపత్రాలు

అరసవల్లి: గత వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు ప్రజలకు తెలియజేసేందుకే ముఖ్యమంత్రి చంద్రాబాబు శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం విశాఖ-ఏ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, దోపిడీలు నిత్యకృత్యంగా మారాయన్నారు. ఇంతటి ప్రమాదకరమైన పరిపాలనను దేశం ఎప్పుడూ చవిచూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నందునే ఆధారాలతో సహా శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నామని తెలిపారు. వైసీపీ కార్యాలయాల కోసం రూ.300 కోట్ల విలువైన భూములను నామమాత్రపు రుసుంతో 33 ఏళ్ల లీజుకు కేటాయించడం దారుణమన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తాం



కాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్/గార: నియోజకవర్గంలో ప్రతీఎకరాకు సాగునీరందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్, గార మండలాల్లో అయ్యవారిపేట నుంచి శ్రీకూర్మం, దల్లం వరకు వంశధార కాలువల్లో చేపట్టిన పనులను శంకర్ బుధవారం పరిశీలించారు. శివారు భూములకు సైతం సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే గొంటి పంచాయితీ లంకపేటలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి వరసిద్ధి ప్రసాద్ గురూజీ ఆశీర్వాదం తీసుకున్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: నియోజకవర్గంలోని వెనుకబడిన తరగతుల వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులు అభ్యున్నతికి వార్డెన్లు అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. బుధవారం శ్రీకాకుళంలో ఆమదాలవలస నియోజకవర్గంలోని బీసీ హాస్టల్స్ వార్డెన్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వసతిగృహాల్లో ఉన్న విద్యార్థుల వివరాలు, ప్రస్తుతం చేరుతున్న విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమదాలవలస రెండు, పొందూరు రెండు, కింతలి, లోలుగు, బూర్జ మండలం తోటవాడ గ్రామాల్లో ఉన్న వెనుకబడిన తరగతుల వసతిగృహ అడ్మిషన్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వసతిగృహ భవనాలు, వసతులపై ఆరా తీశారు. హాస్టల్స్‌లో పూర్తి స్థాయి వసతుల కల్పనకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు. స్వామివారిని జిల్లాపరిషత్ సీఈవో వెంకటేశ్వరరావు కుటుంబసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలుకగా, ప్రసాదాన్ని ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి వారికి అందజేశారు.

ఘనంగా న్యాయవాదుల దినోత్సవం



సీనియర్ న్యాయవాదిని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ న్యాయదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలోని సీనియర్ న్యాయవాదులను సత్కరించి గౌరవించడం ఆనందంగా ఉందని లైన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. ప్రస్తుత రోజుల్లో న్యాయవ్యవస్థ సామాన్యుడికి న్యాయం కలిగేలా పలు చట్టాలను అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజలను రక్షించడంతో పాటు దేశశాంతి, భద్రత శ్రేయస్సుకు భంగం కలిగించే వ్యక్తులకు హెచ్చరికగా పనిచేసేదే న్యాయవ్యవస్థ అన్నారు. అన్యాయం జరగకూడదన్నదే న్యాయవ్యవస్థ ప్రధాన ఉద్దేశమని ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటర్ నటుకుల మోహన్ అన్నారు. కార్యక్రమంలో డీసీటీ దేవభూషణం, సభ్యులు శిల్లా మణి గుత్తు చిన్నారావు, పొడుగు చరణ్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానంతో ప్రయోజనం

కంచిలి: సేంద్రీయ విధానంలో వ్యవసాయం రైతులకు మేలు చేకూరుతుందని రీజినల్ కోఆర్డినేటర్ హేమసుందర్ అన్నారు. కత్తివరంలో రైతులకు సేంద్రీయ విధానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయంలో అంతర పంటలుగా అలసందలు, బరబటీ, గోరు చిక్కుడు, బెండ, చిక్కుడు, ముల్లంగా, గోంగూర తదితర పంటలు సాగు చేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చున్నారు. వీటి వల్ల భూమిలో జీవవైవిద్యం పెరిగి సారవంతం అవుతుందన్నారు. శివానందం, ఎస్.కుమారి, తలసయ్య, కామరాజు, చిట్టిబాబు, ఐసీఆర్‌పీలు ఉన్నారు.

వైసీపీ దోపిడీ ప్రజలంతా తెలుసుకోవాలి



వార్డెన్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి: గత వైసీపీ పాలకుల దోపిడీని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. రామయ్యపుట్టుగలోని తన స్వగృహం వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం లో సహజవనరుల దోపిడీ ఎలా జరిగిందో వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేసి గత పాలకుల దోపిడీని బయట పెడుతున్నట్టు తెలిపారు. భూ ఆక్రమణలు, ఇసుక దందా, ఇళ్లపట్టాలు పేరిట భారీగా దోచుకున్నారని దుయ్యబట్టారు. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో భారీగా దోచుకున్నారని ఆరోపించారు. అలాగే రామయ్యపుట్టుగలోని తన స్వగృహం వద్ద బుధవారం నియోజకవర్గ వార్డెన్లతో సమావేశాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు. ఏబీసీ రఘు, వార్డెన్లు పాల్గొన్నారు.

రైల్వేశాఖ నుంచి భూములు కాపాడాలి

సోంపేట: కొర్లాం పంచాయతీ పరిధిలో రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న రైతుల భూములను కాపాడాలంటూ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు ఆ గ్రామ రైతులు బుధవారం వినతి పత్రం అందించారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ప్రహరీ నిర్మాణంతో తమ భూములు కోల్పోతున్నామని ఎమ్మెల్యేకి వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తమ భూములను కాపాడాలని కోరారు. రాంబుడ్డి గణపతి, రాంబుడ్డి జానకిరావు, చందుకు తదితరులు ఉన్నారు.

మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు



మంత్రితో జనసేన పార్టీ నాయకులు

ఇచ్ఛాపురం: జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి ఇచ్ఛాపురం నియోజకవర్గం లోని ప్రధాన సమస్యలు తీసుకెళ్లినట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోదన రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాత్రి విజయవాడలోని మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో గల నాలుగు మండలాలు, మున్సిపాల్టీ ప్రజలు తాగునీటి ఇబ్బందులు వివరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.ఈశ్వరరావు, నేతాజీ, లింగరాజు, పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం: జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈమేరకు పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి మూడు విడతలుగా సభ్యత్వ నమోదులో జిల్లాలోనే నియోజకవర్గం ముందువరుసలో నిలిపామని నాలుగో విడతలో కూడా తగిన ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నుంచి పది రోజులు పాటు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోదనరెడ్డి, నాయకులు బైపల్లి ఈశ్వరరావు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగులు హరి బెహరా, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల పార్టీ అధ్యక్షులు డి.నీలవేణి, డి.ఈశ్వరరావు, పాల్గొన్నారు.

బుడగట్లపాలెం బ్రిడ్జిపై గుంతలు



బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు

ఎచ్చెర్ల: కుప్పిలి-బుడగట్లపాలెం బ్రిడ్జిపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతల వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికా రులు స్పందించి బ్రిడ్జిపై గుంతలను పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఆ గ్రామ సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు కోరారు.

సాఫ్ట్‌బాల్‌కు పెరుగుతున్న ఆదరణ



పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడపై రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని అసోసియేషన్ జిల్లా కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో సాఫ్ట్‌బాల్ క్రీడను పరిచయం చేస్తున్నామన్నారు. క్రీడాకారులు నిరంతరం శిక్షణలో నిమగ్నం కావాలని సూచించారు. డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, జిల్లా ఒలింపిక్ సంఘ సలహాదారు పి.సుందరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, సబ్ రిజిస్ట్రార్ జి.రాజు, సంఘ ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, ప్రతినిధులు బి.సురేష్‌కుమార్, ఎం.ఆనంద్‌కిరణ్, ఎ.రాజగోపాల్, జి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: తొగరాం సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ మరమ్మతులు చేపట్టనుండడంతో ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ సత్తారు బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రూరల్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ జీకే వలస ఫీడర్ పరిధిలో ఉన్న నిమ్మతొర్లాడ, జీకే వలస, కొరపాం, సీపానిపేట, పాతూరు తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు, వినియోగదారులు సహకరించాలన్నారు.

● **రణస్థలం:** విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించే నేపథ్యంలో శుక్రవారం రణస్థలం 33కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో జేఆర్ పురం, రణస్థలం, గిరికిపాలెం, బావరాజపాలెం, దన్నానపేట గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయ ఏర్పడనుందని ఈఈ బయ్యనాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా ఎర్రవరం 33కేవీ సబ్‌సేషన్ పరిధిలో యర్రవరం, చిన్నయామాలపేట, పెద్దయామాలపేట, కుమ్మరిపేట గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని కొరారు.

అధికారులతో కేంద్రమంత్రి సమీక్ష రేపు

ఇచ్ఛాపురం: మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమీక్షించనున్నట్టు కమిషనర్ ఎన్.రమేష్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్షిస్తారన్నారు.

గోకుల షెడ్ల నిర్మాణానికి రాయితీ

ఆమదాలవలస: పాడి రైతులు మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకందారులకు షెడ్లు నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ అందించేందుకు పథకాన్ని ప్రవేశపెట్టిందని బుధవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్లు నిర్మాణానికి ముందుకు వచ్చే లబ్ధిదారులకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీతో నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఆవుల షెడ్ నిర్మాణానికి షెడ్ ఖరీదులో 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు నిర్మాణానికి 70 శాతం రాయితీతో ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం పొందేందుకు సొంత స్థలం, ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరిగా ఉండాలని, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఎస్సీఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. 2014-2019 సంవత్సరాల మధ్య టీడీపీ అధికారంలో ఉండగా గోకులషెడ్లు నిర్మాణం కోసం డీడీలు కట్టి షెడ్ల నిర్మాణం చేపట్టిన రైతులకు బిల్లులు అందకపోతే సంప్రదించాలని ఎమ్మెల్యే కోరారు.

క్రికెట్‌లో రాణిస్తున్న సుశాంత్



జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న సుశాంత్

శ్రీకాకుళం స్పోర్ట్స్: నార్త్‌జోన్ క్రికెట్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సంబాళ్ల సుశాంత్ వరుస సెంచరీలతో సత్తా చాటుతున్నాడు. కడప జిల్లాలో జరుగుతున్న అంతర్ జోనల్ పోటీల్లో టెక్కలికి చెందిన సుశాంత్ రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్‌పై 11 ఫోర్లు, రెండు సిక్సర్లతో 104 పరుగులు సాధించారు. అదేవిధంగా మంగళవారం విశాఖపై జరిగిన మాచ్‌లో విధ్వంసకరమై న బ్యాటింగ్‌తో 16 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 121 పరుగులు సాధించి ఆకట్టుకున్నాడు. అదేవిధంగా జిల్లాకు చెందిన క్రీడాకారులు ఏపీఎల్ టీ20 పోటీల్లో ఎస్‌హెచ్ శ్రీనివాస్, సాత్విక్ సత్తాచాటుతున్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో మేలు

ఆమదాలవలస: పచ్చిరొట్ట ఎరువులతో ప్రకృతి వ్యవసాయానికి నాంది పలుకుతున్నట్టు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం వెదురుళ్లవలస పంచాయతీలో సాగు చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎఫ్‌పీవో సీసీ రామప్పడుతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు సాయం

శ్రీకాకుళం రూరల్: చేపల వేట కోసం తమిళనాడు వలస వెళ్లిన చిన్న గనగళ్లవానిపేట గ్రామానికి చెందిన గనగళ్ల కొర్లయ్య, దాసరి వెంకయ్యలు శ్రీలంక కోస్ట్‌గార్డులకు చిక్కారు. దీంతో వారి కుటుంబాలకు 'పిలుపు' స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను కలుసుకుని మత్స్యకార శాఖ ఎఫ్‌డీవో గోపి, జిల్లా మత్స్యకార సహకార అధ్యక్షులు నర్సింహులు చేతుల మీదుగా రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు సంస్థ డైరెక్టర్ జి.రవికుమార్ అందించారు.